

చిత్తూరులో నగరవనం ప్రారంభోత్సవానికి మనవడి ద్వారా రిబ్బన్ కట్ చేయిస్తున్న పెద్దిరెడ్డి - డీసీసీబీ బ్యాంకు నూతన శాఖ ప్రారంభోత్సవ శిలాఫలకం వద్ద..

మనవడా.. మజాకా!

- ఎడాపెడా రిబ్బన్లు కత్తిరిస్తూ, ప్రారంభోత్సవాలు చేస్తూ, మొక్కలు నాటుతూ సందడి చేస్తున్న మిథున్‌రెడ్డి కొడుకు



చిత్తూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తాత మంత్రి, తండ్రి పార్లమెంటు సభ్యుడు. ఇంకేం.. ఆ పదమూడేళ్ల పిలగాడిని సకల అధికార యంత్రాంగమూ ముద్దు జేస్తోంది. ఎక్కడకి వచ్చినా పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలుకుతున్నారు. కత్తెర చేతికిచ్చి రిబ్బన్లు కత్తిరించమంటున్నారు. శిలాఫలకాల్లో పేరు చేర్చలేదుగానీ ఆవిష్కరణలూ చేయించేస్తున్నారు. అంతేనా, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ఏకంగా వేదికమీదే కుర్చీ వేసి గౌరవిస్తున్నారు. ఇదంతా కొన్ని రోజులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనవడు, ఎంపీ మిథున్‌రెడ్డి కుమారుడు అయిన పెద్దిరెడ్డి జష్విన్‌రెడ్డి జిల్లాలో అనుభవిస్తున్న దర్జా. పెనుమూరు, చిత్తూరు ప్రాంతాల్లో ఆదివారం పెద్దిరెడ్డి మనవడిని వెంటబెట్టుకుని పర్యటించారు. పెనుమూరు మండలంలో డీసీసీబీ బ్యాంకు నూతన బ్రాంచ్, వెదురుకుప్పం మండలం చవటగుంటలో డీసీసీబీ బ్యాంకు ఏటీఎం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మనవడు బాబు శిలాఫలకం ఆవిష్కరణతో పాటు రిబ్బన్ కటింగ్ కూడా చేశాడు. వేదిక మీద పెద్దిరెడ్డి పక్కనే కూర్చున్నాడు. అధికారులు కూడా అంతే గౌరవంగా జష్విన్‌రెడ్డికి స్వాగతం పలికారు. చిత్తూరు నగరంలోని పెనుమూరు క్రాస్ వద్ద అటవీ శాఖ ఏర్పాటుచేసిన నీవా నగరవనం ప్రారంభోత్సవంలోనూ పెద్దిరెడ్డి మనవడు రిబ్బన్ కటింగ్ చేసి, మొక్కలకు నీళ్లు పోశాడు. ఈ నెల 5న సంతపేటలో చుడా ఉద్యానవనం భూమి పూజలోనూ ఈ పిలగాడు సందడి చేశాడు. చుడా వీసీ విశ్వనాథ్ పుష్పగుచ్ఛంతో మనవడు బాబుకు స్వాగతం పలికారు. ప్రొటోకాల్ సంగతంటారా.. జగనన్న పాలనలో నాయకులు చెప్పిందే ప్రొటోకాల్ మరి.

వేదికపై చివరన..!

తన సొంత నియోజకవర్గమైన పెనుమూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి వేదికపై చివరి కుర్చీ దక్కింది. డీసీసీబీ బ్రాంచి కార్యాలయ ప్రారంభోత్సవం తర్వాత పార్టీ ఆధ్వర్యాన జరిగిన సభలో ఈయనకు ప్రాధాన్యం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి అధికార పార్టీలోని విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కూడా ఒక పక్కగా కుర్చీ వేసుకుని కూర్చోవాల్సి వచ్చింది. ఇలా బహిరంగ సభలో, పార్టీ వేదికపై దళిత ప్రజాప్రతినిధులకు అవమానం జరిగిందంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతుండగా.. కూర్చున్న వారిలో ఎంపీ రెడ్డెప్ప, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎన్‌ఆర్‌ఐ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, పెద్దిరెడ్డి మనవడు జష్విన్‌రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్‌రెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, ఎంపీపీ హేమలత ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విజయానందరెడ్డివన్నీ అక్రమ వ్యాపారాలే

- వైసీపీ పెద్దలకూ వాటాలు
- తాను అక్రమాలకు పాల్పడలేదని కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమన్న ఆరణి

చిత్తూరు సిటీ, మార్చి 10: 'పోలీసులు, అధికారులను అడ్డుపెట్టుకుని విజయానందరెడ్డి ఎన్నో అక్రమ వ్యాపారాలు చేస్తున్నాడు. లాటరీ, గుట్కా, ఇసుక, పేకాట, గంజాయి వ్యాపారాలు చేస్తున్నారు. ఎర్రచందనాన్ని కొల్లగొట్టి కోట్లు సంపాదిస్తున్నాడు. అందులో వైసీపీ బడానాయకులకు వాటా పంపిస్తున్నాడు' అంటూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్ర విమర్శలు చేశారు. చిత్తూరు నగరం లక్ష్మీనగర్ కాలనీలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను భూబకాసురుడినని చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ ఆరోపణలపై తాను కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధంగా ఉన్నానంటూ సవాల్ విసిరారు. అక్రమ సంపాదనను కాపాడుకోవడానికి ఆయన దొడ్డిదారిలో ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుని, రాజకీయ నాయకుడి అవతారమెత్తారని ఆరోపించారు. విజయానందరెడ్డిపై 36 కేసులున్నాయన్నారు. ఆయన చుట్టూ ఉన్న ఫైలెట్ 420 గ్యాంగ్ నోరు అదుపులో పెట్టుకోకుంటే జనసైనికులే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. డబ్బులిచ్చి సోషల్ మీడియాలో తనపై సత్య ఆరోపణలతో పోస్టులు పెట్టించినంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. వీటిని జనసైనికులు కూడా తిప్పికొట్టాలని, ప్రతి పోస్టుకు కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం మరో 40 రోజులు అధికారంలో ఉంటుందని దమ్ముంటే తనపై వచ్చిన ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. ఆ తర్వాత విజయానందరెడ్డి అనుచరులు ఎక్కడుంటారో తెలుసుకోవాలని హెచ్చరించారు. రాబోయేది టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వమని ధీమా వ్యక్తం చేశారు. చిత్తూరుకు ఎవరు ఎమ్మెల్యేగా ఉంటే మంచి జరుగుతుందో ప్రజలు ఆలోచించాలని కోరారు. చిత్తూరు ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ గెలుపునకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

- కూర్మవరదరాజస్వామి గుడిలో

బయటపడ్డ పంచలోహ విగ్రహాలు



కూర్మ వరదరాజస్వామి గుడిలో జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులు

పలమనేరు, మార్చి 10: పలమనేరు మండలం కూర్మాయి గ్రామం వద్ద కూర్మవరదరాజ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల సందర్భంగా ఆదివారం పంచలోహ విగ్రహాలు బయటపడ్డాయి. గర్భగుడి పునాదులను ఎక్స్‌కవేటర్ సాయంతో తవ్వుతుండగా ఒక విగ్రహం తాలూకు తల కనిపించింది. జాగ్రత్తగా తవ్వి వెలికి తీయగా సుమారు 2.5 అడుగుల ఎత్తు గల శంఖం, చక్రం ధరించిన మహావిష్ణువు, శ్రీదేవి, భూదేవి పంచలోహ విగ్రహాలతో పాటు పూజా కార్యక్రమాలకు వినియోగించే లోహ వస్తువులూ బయటపడ్డాయి. వీటి విలువ రూ.కోట్లలో ఉంటుందని అంచనా. ఈ ఆలయాన్ని 12వ శతాబ్దంలో కౌండిన్య నది ఒడ్డున ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. మహమ్మదీయుల దండయాత్ర నుంచి ఆలయాన్ని కాపాడే నేపథ్యంలో నాటి గ్రామస్థులు కూర్మ వరదరాజ స్వామి ఆలయాన్ని ఇసుక, మట్టితో కప్పేసినట్లు పెద్దలు చెబుతున్నారు. 1950లో కర్ణాటక రాష్ట్రం నంగిలి సమీపంలోని కరిడిగానిపల్లికి చెందిన చెంగారెడ్డి అనే మోతుబరి రైతు ఈ గ్రామానికి వచ్చిన సందర్భంగా పొలిమేరల్లోని మట్టి, ఇసుక కింద ఆలయ శిఖరాన్ని గుర్తించినట్లు చెబుతారు. అలా బయటపడిన ఆలయం.. పురాతన దశకు చేరింది. దీనిని జీర్ణోద్ధరణ చేసేందుకు దేవదాయశాఖ గతేడాది రూ.1.25 కోట్లను మంజూరు చేసింది. ఇందులో రూ.25 లక్షలు గ్రామస్థులు, దాతలు భరించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు చేపట్టిన జీర్ణోద్ధరణ పనుల్లో పంచలోహ విగ్రహాలు.. పూజాసామగ్రి బయటపడ్డాయి. కూర్మవరదరాజస్వామి విగ్రహం భద్రపరచిన చోటనే వీటినీ ఉంచి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కాగా, మహమ్మదీయుల దండయాత్ర సందర్భంగా ఈ విగ్రహాలను నాడు గ్రామస్థులు గర్భగుడి కింద పూడ్చి ఉంటారని భావిస్తున్నారు. ప్రస్తుతం బయటపడిన విగ్రహాలకు భద్రత కల్పించి, జీర్ణోద్ధరణ ముగిశాక ఆలయంలో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తవ్వకాలలో బయటపడిన విష్ణువు,భూదేవి, శ్రీదేవి, పంచలోహ విగ్రహాలు, పూజాసామగ్రి



గర్భగుడిలో ఆదివారం తవ్వుతూ..

రేపటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

చిత్తూరు కల్చరల్, మార్చి 10: రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ఏప్రిల్ 10వ తేది వరకు ఉపవాస దీక్షలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ఖాజీ సయ్యద్ కమాలుల్లా జుహారి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన రంజాన్ ఉపవాస కాలమాన పట్టికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఘని, డివిజన్ ఖాజి నయిముల్లా జునైది, కార్పొరేటర్లు అను, సయ్యద్, రషీద్, బషీర్, అహమద్, అబ్దుల్ గఫార్, గులాం రసూల్, సుల్తాన్, మునీర్, అడ్వకేట్ మొహిద్దీన్, ముక్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా శ్మశానానికి తరలివస్తున్న అంగాళపరమేశ్వరీమాత

ఉగ్రభక్తి.. శ్మశాన 'శక్తి'

- కుప్పంలో వైభవంగా అంగాళపరమేశ్వరీ జాతర

కుప్పం, మార్చి 10: ఒకవైపు పరపరమని నములుతున్న మానవాస్థికల శబ్దం.. మరోవైపు దేహాలపై ఛెళ్లుమంటున్న కొరడాల నాట్యం. అస్థికపాలాలతో పూజలు ఒకవైపు.. ఉగ్రరూపంలో వేంచేసిన అమ్మవారు మరోవైపు. అక్కడ ఉగ్రభక్తి విలయతాండవం చేసింది. శ్మశాన 'శక్తి' భక్తులను పూనింది. కుప్పం శ్మశానంలో ఆదివారం జరిగిన అంగాళ పరమేశ్వరీమాత జాతర వైభవ చిత్రమిది.

తమిళ సంప్రదాయం ప్రకారం మహాశివరాత్రి ముగిశాక వచ్చే అమావాస్య రోజున శ్మశానకొల్లు జరుపుకుంటారు. అందులో భాగంగా కొత్తపేటలోని అంగాళ పరమేశ్వరీ మాతకు సంప్రదాయం ప్రకారం బెస్త కులస్థులు పూజలు చేశారు. మాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా కుప్పం నడిబొడ్డున ఉన్న శ్మశానానికి మధ్యాహ్నం 12 గంటల సమయంలో తీసుకొచ్చారు. ఆంధ్రాతోపాటు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచీ భక్తులు తండోపతండాలుగా ఇక్కడికి చేరుకున్నారు. ఆసరికే అమ్మవారి విశ్వరూప ప్రతిమను శ్మశాన భూమిమీదే మట్టితో తయారు చేసి ప్రతిష్ఠించారు. శ్మశానంనుంచి తవ్వితెచ్చిన మానవ కంకాళాలు, అస్థికలు పెట్టి, పసుపు కుంకుమలతో పూజలు చేశారు. కొందరు మహిళా భక్తులు పూనకాలతో ఊగిపోతూ సమాధులు తవ్వి, అస్థికలు బయటకు తీసి పళ్లమధ్య పెట్టుకుని పరపర నమిలారు. మరికొందరు మోకాళ్లపై కూర్చోగా పూజారులు వారి వీపుల మీద కొరడాలతో కొట్టారు. దెయ్యాలు, పిశాచాలు పట్టిన వ్యక్తులు ఈ కొరడా దెబ్బలు తింటే బాగైపోతారని.. ఇలా దెబ్బలుతున్న కుటుంబాలకు మంచి జరుగుతుందని భక్తుల నమ్మిక. చివరకు అంగాళపరమేశ్వరీ జాతర తుది ఘట్టంలో అమ్మవారి ప్రతిమనుంచి భక్తులు మట్టిని సేకరించారు. దీనిని ఇంట్లో ఉంచుకుంటే శుభాలు కలుగుతాయన్నది వీరి నమ్మకం.









అంగాళపరమేశ్వరి మట్టి బొమ్మ - ఎముకలు కొరుకుతున్న భక్తురాలు- కొరడాలతో ఛెళ్లుమనిపిస్తూ.. - అమ్మవారి బొమ్మనుంచి మట్టిని సేకరిస్తున్న భక్తులు

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర బలగాల కవాతు



చిత్తూరు, మార్చి 10: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడంతో పాటు ప్రజల్లో నమ్మకం, ఆత్మవిశ్వాసం నింపడానికి ఆదివారం కేంద్ర బలగాలు చిత్తూరుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర బలగాలతో పాటు సుమారు వంద మంది సివిల్, ఆర్మ్‌డ్ సిబ్బంది పలు వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో అసాంఘిక శక్తులు చొరబడే ప్రమాదం ఉన్నందునా .. వారికి ముందుగానే హెచ్చరికలు జారీ చేయడానికే కవాతు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. ప్రజలకు రక్షణ కల్పించే బాధ్యత పోలీసులదేనని, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసు కమాండెంట్ ప్రదీప్ వర్మ, సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, కుళ్లాయప్ప, రవిశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుదర్శన్ ప్రసాద్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి



పురుషోత్తం (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, మార్చి 10: బంగారుపాళ్యం మండలంలో ఇటీవల జరిగిన గొడవలో గాయపడ్డ పురుషోత్తం.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. టేకుమంద గ్రామానికి చెందిన పురుషోత్తం, రమేష్ కుటుంబాల మధ్య బోరు మోటారు విషయమై మూడో తేదీన పొలం వద్ద గొడవ జరిగింది. రమేష్ కుటుంబసభ్యులు పురుషోత్తంను గాయపరిచారు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడ్నుంచి తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి పురుషోత్తం (56) మృతిచెందాడు. ఇతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య జగదాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్ కుటుంబసభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్లు చెప్పినవాళ్లకే పదవులు, వర్కులు ఇచ్చా

● భావోద్వేగానికి గురైన డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు, మార్చి 10: 'పెనుమూరు మండలంలోని రెడ్లు చెప్పిన వాళ్లకే నేను బీఫారాలు, పదవులు, వర్కులు ఇచ్చాను. అయితే ఈ రోజు బాధతో మాట్లాడుతున్నా' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి భావోద్వేగానికి గురయ్యారు. పెనుమూరులోని డీసీసీబీ బ్రాంచ్‌ను ఆదివారం డిప్యూటీ సీఎంతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం బస్టాండులో జరిగిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తానెవరికీ అన్యాయం చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో తన కుమార్తె కృపాలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నారాయణస్వామి వర్గీయులను స్టేజిపైకి ఆహ్వానించకపోవడంపై నిరుత్సాహానికి లోనయ్యారు. ఇదిలా వుండగా నారాయణస్వామి వర్గీయులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో ఎన్ఆర్ఐ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి ఫొటో వేయలేదు. అదేవిధంగా జ్ఞానేంద్ర రెడ్డి వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో నారాయణస్వామి వర్గీయులకు చెందిన మండల వైసీపీ కన్వీనర్ ఫొటో వేయలేదు. దీంతో ఇరువర్గాల వారు వాగ్వావాదాలకు దిగారని సమాచారం. ఇక, స్టేజీపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్పకు ఓ మూలన కుర్చీలు వేశారు. బీసీ వర్గానికి చెందిన జడ్పీటీసీ దొరస్వామి కూడా నిలబడే ఉన్నారు. ఈ పరిణామాలను నారాయణస్వామి వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. ఈ సభలో డీసీసీబీ ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి, నేతలు దయాసాగర్‌రెడ్డి, యశోదారెడ్డి, హేమలత, విజయకుమార్‌రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి క్షేత్రానికి కల్యాణ శోభ



ఆది దంపతుల వివాహ వేడుకకు ముస్తాబైన పెండ్లి మండపం

శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేకువ జామున 3.30 గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకోసం శ్రీకాళహస్తి పట్టణంలోని కైకాలవారి పెండ్లి మండపాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. నెహ్రూ వీధి, నగిరి వీధుల్లో భక్తజనులు, పెళ్లిబృందాలు విడిది చేయడానికి బారికేడ్లను ఏర్పాటు చేశారు. మరోవైపు ఆదివారం సాయంత్రం నుంచే క్షేత్రానికి కల్యాణ శోభ సంతరించుకుంది. కల్యాణోత్సవ ఘడియల్లో పెళ్లి చేసుకోవడానికి పలు జంటలు తరలివచ్చాయి. ఈ క్రమంలో బాల్య వివాహాలు జరక్కుండా అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ముక్కంటీశుడిని గజవాహనంపై, జ్ఞాన ప్రసూనాంబదేవిని సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఊరేగింపుగా పెండ్లి మండపం వద్దకు బయల్దేరారు.

ఆలయాన్ని వీడి.. ఊర్లోకి వచ్చి..

దేశంలో ఎక్కడా లేనివిధంగా దేవుళ్లు.. ఆలయాన్ని వీడి, ఊర్లోకి వచ్చి వివాహం చేసుకోవడం ఒక్క శ్రీకాళహస్తిలో మాత్రమే జరుగుతుంది. ఈ ఉత్సవానికి శాశ్వత ఉభయదారులుగా కైకాల వంశస్థులు వ్యవహరిస్తున్నారు.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

● దాదాపు 25 అంశాలపై చర్చించనున్న సభ్యులు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం తిరుమలలో జరుగనుంది. బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో సభ్యులు దాదాపు 25 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి, తీర్మానాలు చేయనున్నారు. ఆలయంలోని సన్నిధితీర్థ పీఠం, కొలువు పీఠాలపై బంగారు తాపడంతో రాగి రేకులను ఏర్పాటు చేసే అంశంతోపాటు వసతి గృహాలు, పీఏసీ-1 మరమ్మతులు, ముడి సరుకుల కొనుగోళ్లు, బాలాజీనగర్ సమీపంలో సుమారు రూ.1.5 కోట్లతో ఫెన్సింగ్ ఏర్పాటుపై చర్చించనున్నట్టు సమాచారం. అలాగే రూ.14 కోట్లతో తిరుమలలోని ఉద్యోగుల క్వార్టర్స్ మరమ్మతులు,వివిధ జాతీయ బ్యాంకుల్లో బంగారు నిల్వలు, వాటిపై వచ్చే వడ్డీ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు,ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై చర్చించనున్నట్టు తెలిసింది. కాగా, ఎన్నికల కోడ్ సమీపిస్తున్న క్రమంలో ఇదే టీటీడీ చివరి బోర్డు సమావేశమనే చర్చ నడుస్తోంది.

రాజకీయ వికలాంగుడు చంద్రబాబు

● మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శ



మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి తదితరులు

కుప్పం, మార్చి 10: 'చంద్రబాబు రాజకీయ వికలాంగుడు. పొత్తులులేకుండా నిలబడలేడు పాపం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కుప్పంలో రూ.5 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. అలాగే కుప్పం చెరువుకట్ట చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్, సింగిల్‌విండో భవనాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం చేయూత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ విద్యాసాగర్, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.



గిత్తను పట్టాలని..



గిత్త కాళ్ల కింద పడిన యువకుడు



గిత్త కొమ్ములు వంచి..

కొమరగుంటలో జల్లికట్టు

వెదురుకుప్పం, మార్చి 10: వెదురుకుప్పం మండలం కొమరగుంటలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. అల్లిని ఏర్పాటు చేసి, వివిధ రకాల పట్టీలను కోడెగిత్తల కొమ్ములకు కట్టి అల్లి వైపు వైదిలారు. అప్పటికే అల్లిలో ఉన్న యువకులు కోడెగిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. నిలువరించి పట్టీలను దక్కించుకునే క్రమంలో యువకులు కొందరు గాయపడ్డారు. జల్లికట్టు నిర్వహణతో ఆ గ్రామంలో జన సందడి ఏర్పడింది.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్



ఎంఈవోలతో సమీక్షిస్తున్న డీఈవో దేవరాజులు

గంగవరం, మార్చి10: గంగవరంలోని మదర్‌థెరీసా కళాశాలలో సోమవారం నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్ట్ కాంపిటీషన్స్ ఉంటాయని డీఈవో దేవరాజులు తెలిపారు. గంగవరం హైస్కూల్‌లో ఆదివారం ఎంఈవోలు, ఇన్‌స్పైర్ కమిటీ సభ్యులతో ఆయన సమీక్షించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసి బాల మేధావులను తయారు చేయడమే ఇన్‌స్పైర్ మనక్ లక్ష్యమన్నారు. రాష్ట్ర అధికారులు, జిల్లా అధికారులతో పాటు ఢిల్లీ నుంచి అబ్జర్వర్లు కూడా వస్తారన్నారు. బాలురకు, గైడ్ టీచర్లకు పలమనేరులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో, బాలికలకు, ఉమెన్ గైడ్ టీచర్లకు ఎలినాబెటిని స్కూల్, పలమనేరు హైస్కూల్‌లో వసతి ఏర్పాటు చేశామన్నారు. డీవైఈవో చంద్రశేఖర్, డీఎస్‌వో రమణ, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సిద్ధం సభకోసం..!

● 300 కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్ ఆంక్షలు

● సూళ్లూరుపేటలో భారీ వాహనాలు ఆపేసిన పోలీసులు





హైవేపై వాహనాలు ఆపి పార్కింగ్‌కు పంపుతున్న పోలీసులు - మాంబట్టు సెజ్‌లో నిలిపేసిన వాహనాలు

సూళ్లూరుపేట, మార్చి 10: బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగే సిద్ధం సభ కోసం 300 కిలోమీటర్ల దూరంలోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 10గంటల నుంచే నెల్లూరు వైపు వెళ్లే భారీ వాహనాలను హైవేలోని సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద, తడ మండలం కొండూరు సమీపంలో అపాచి క్రాస్ రోడ్డు వద్ద సీఐ మధుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆపేశారు. వీటిని మాంబట్టు సెజ్‌లో ఉన్న ఖాళీ స్థలాల్లోకి మళ్లించారు. సీఎం సభ జరుగుతుందని, సాయంత్రం వరకు ఇక్కడే ఉండాలని హుకుం జారీ చేశారు. హైవేపై తాము వెళుతుంటే ట్రాఫిక్ ఇబ్బంది ఏంటని వాహనాల డ్రైవర్లు లబోదిబోమన్నా ఫలితం లేకపోయింది. దీనివల్ల డ్రైవర్లు, క్లీనర్లకు తాగునీరు, మధ్యాహ్నం భోజనం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 68,446 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,549 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీ జూపార్కులో సీసీ కెమెరాల ఏర్పాటు


మంగళం, మార్చి 10 : ఎస్వీ జూపార్కులో కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకి సింహం దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత జూ అధికారులు సందర్శకుల రక్షణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పులులు, సింహాల ఎన్‌క్లోజర్లు, వాటి వద్దకు వెళ్లేదారుల్లో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జూలో 60 సీసీ కెమెరాలు ఉన్నట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. దాదాపు రూ.2లక్షలతో కొత్త కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు జంతువులు వేసవి తాపం తట్టుకునే విధంగా స్ప్రింక్లర్స్, గ్రీన్‌షేడ్ నెట్, వట్టివేర్ల తెర, కూలర్లు, ఫాగర్స్, ఎగ్జిట్ ఫ్యాన్లు, గ్లూకోజ్ తెప్పించామన్నారు.

రామనామస్మరణతో పులకించిన సప్తగిరులు



తిరుమల, మార్చి10(ఆంధ్ర జ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం జరిగిన 8వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 26 నుంచి 30వ సర్గ వరకు ఉన్న 156 శ్లోకాలు, యోగవాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 181 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీనివాస్ బృందం 'వందనము రఘువందన సేతు.., రామ రామ అన రాదే..' అను కీర్తనలను రసరమ్యంగా ఆలపించారు.

తిరుమలలో వృద్ధుడి అదృశ్యం



హనుమంతరాయప్ప (ఫైల్ ఫొటో)

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కర్ణాటకకు చెందిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయాడు. తిరుమల వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక ముఖనేహల్లికి చెందిన హనుమంతరాయప్ప(64)తో కలిసి కుమారుడు సిద్దరాజు, కుటుంబ సభ్యులు జనవరి 29వ తేదీన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామి దర్శనానికి క్యూ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 18వ కంపార్టుమెంట్‌కు చేరుకున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లివస్తానని చెప్పిన హనుమంతరాయప్ప తిరిగి రాలేదు. పరిసరాలతో పాటు తిరుమల, సొంతూరులో ఎంత గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తిరిగి తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమంతరాయప్ప వివరాలు తెలిసిన వారు 0877 2289027, 94407 96771లకు తెలియజేయాలని పోలీసులు ఆదివారం ఓ ప్రకటన ద్వారా కోరారు.

ఎలా ఉన్నారు?

- ఎన్టీఆర్ రాజుకు నందమూరి కుమారుడి పరామర్శ



తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వీరాభిమాని అయిన ఎన్టీఆర్ రాజు(రామచంద్రరాజు)ను తన కుమార్తె రూపతో కలిసి నందమూరి కుమారుడు మోహన్‌కృష్ణ పరామర్శించారు. తారకరత్న వర్ధంతి సందర్భంగా శనివారం తిరుమలకు వచ్చిన వీరు ఆదివారం స్థానికుడైన రాజును కలిశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను పరామర్శించి, పాతరోజులను గుర్తుచేసుకున్నారు. త్వరలోనే ఆరోగ్యం కుదుటపడుతుందని ధైర్యం చెప్పారు. వీరివెంట ఫిలిమ్ చాంబర్ సెక్రటరీ ప్రసన్నకుమార్, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులున్నారు.

మగ బిడ్డను పెంచుకోవాలనే ఎత్తుకొచ్చేశా

● కిడ్నాపర్ ఇజ్జాడ దేవి



బిడ్డను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి, క్రైం మార్చి 10: 'నాకు ఆడబిడ్డ ఉంది. మగబిడ్డను పెంచుకోవాలనే తిరుమల నుంచి ఎత్తుకొచ్చేశా' అని నిందితురాలు ఇజ్జాడ దేవి మీడియాకు చెప్పింది. బాలుడిని తిరుపతికి తీసుకొచ్చి లాడ్జిలో ఉండగా పోలీసులు తనను పట్టుకున్నారని పేర్కొంది. ఈ బాలుడిని మరో వ్యక్తికి అప్పగించడానికి ఫోన్ ద్వారా ఆమె ప్రయత్నించింది. అతను రావడం ఆలస్యం కావడంతోనే పోలీసులకు చిక్కింది.

తల్లి ఒడికి చిన్నారి చేరిందిలా..

పోలీసులు అప్రమత్తమవ్వడంతో కొద్ది గంటల వ్యవధిలోనే కిడ్నాప్ గురైన అభినయ్ (3) తల్లి ఒడికి చేరాడు. తిరుపతిలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మీడియాకు వివరాలను తెలిపారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని ఐజ గ్రామానికి చెందిన నగేష్, పరిమళ దంపతులు తమ ఇద్దరు కుమారులు అక్షయ్ (6), అభినయ్(3), కుటుంబీకులతో కలిసి శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు తిరుమలకు వచ్చారు. గది లభించక పోవడంతో పీఏసీ-2లో సేదతీరారు. ఆ సమయంలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన ఇజ్జాడ దేవి తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌తో అభినయ్‌ని ఆడిస్తూ అక్కడి నుంచి ఎత్తుకొచ్చేసింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో బిడ్డ కనిపించడం లేదని గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు బిడ్డను తిరుమల నుంచి దేవి.. ఓ జీపులో తిరుపతికి తీసుకొచ్చేసింది. కెన్సెస్ నుంచి సంధ్య థియేటర్ రోడ్డులోకి వెళ్లి అక్కడున్న ఆర్టీసీ ఉద్యోగుల రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్ యాదవ్‌ను అద్దె గది కావాలని అడిగింది. పెద్దకాపు లేఅవుట్‌లో ఉంటాయని చెప్పడంతో అటువైపు వెళ్లింది. కొంతసేపటికి ఆర్టీసీ డిపో మేనేజర్ ద్వారా వాట్సప్‌లో కిడ్నాప్ వివరాలు చూసిన ప్రభాకర్ వెంటనే ఈ విషయాన్ని సీఐ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశారు. ఆయన.. ఈస్ట్, తిరుమల టూటౌన్ పోలీసులతో కలిసి పెద్దకాపు లేఅవుట్‌లోని లాడ్జీలలో గాలించి నిందితురాలిని, బిడ్డను గుర్తించారు. రాత్రి సుమారు ఎనిమిది గంటలకు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. బిడ్డను తల్లిదండ్రులకు ఎస్పీ అప్పగించారు. స్వల్ప వ్యవధిలోనే కిడ్నాప్ కేసును ఛేదించిన సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని, తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ బృందం, తిరుమల వన్‌టౌన్ కానిస్టేబుల్ కె.మునిశేఖర్‌తోపాటు ఆర్టీసీ నేత ప్రభాకర్ యాదవ్‌ను ఎస్పీ అభినందించారు.



నిందితురాలు దేవి

● ద్విచక్రవాహనం చోరీ కేసులో..

ఏఆర్ కానిస్టేబుల్ సహా ముగ్గురి అరెస్టు



నిందితులను కుప్పం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్న పోలీసులు (మధ్యలో ఉన్న వ్యక్తి గాంధీ)

రామకుప్పం, మార్చి 10: రామకుప్పం మండలం తిమ్మసముద్రం కాలనీ వద్ద యువకుడిని బెదిరించి ద్విచక్రవాహనాన్ని చోరీ చేసి తీసుకెళ్లిన ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ సహా ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. గత నెల 28న కర్ణాటక సరిహద్దు రాజుపేటక్రాస్ నుంచి వస్తున్న మండలంలోని మిట్టపల్లెకు చెందిన ప్రవీణ్‌ను ముగ్గురు వ్యక్తులు బెదిరించి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లిపోయారు. తన బైకుకోసం వెతుకుతున్నా కనిపించలేదు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి ప్రవీణ్ రాజుపేటక్రాస్‌కు బయలుదేరారు. తిమ్మసముద్రం సమీపంలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఎదురుగా స్పీడ్‌బ్రేకర్ వద్ద ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గమనించారు. వెంటనే వారిని తన స్నేహితులతో కలిసి చుట్టుముట్టి చూడగా, తన ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లింది వారేనని, ఆ ద్విచక్రవాహనం కూడా తనదేనని ప్రవీణ్ గుర్తించారు. తన స్నేహితుల సహకారంతో ద్విచక్రవాహనంతోపాటు ఆ ముగ్గురిని పట్టుకుని రామకుప్పం పోలీసులకు అప్పగించారు. కుప్పం మండలం అడవిబూదుగూరుకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గాంధీ(32), ఎ.కొత్తపల్లెకు చెందిన సోమశేఖర్(24), గెరికచిన్నేపల్లెకు చెందిన మోహన్(26)గా వీరిని గుర్తించారు. తన తల్లి గత డిసెంబరు నెలలో చనిపోవడంతో గాంధీ మానసికంగా కుంగిపోయి, విధులకు హాజరు కాకుండా, మద్యానికి అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించాలని సోమశేఖర్, మోహన్‌తో కలిసి వ్యూహరచన చేశాడు. దీనిలో భాగంగా గత నెల 28న ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లిపోయారు. బాధితుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశారు. నిందితులను ఆదివారం కుప్పం కోర్టులో హాజరుపరిచారు.

కొనసాగుతున్న గజ దాడులు

● గుట్టపాళ్యంలో వరి పంట ధ్వంసం



ఏనుగు నాశనం చేసిన వరిపంట

ఐరాల(కాణిపాకం), మార్చి 10: ఐరాల మండలం గుట్టపాళ్యంలో గజదాడులు కొనసాగుతున్నాయి. గుంపు నుంచి తప్పిపోయిన ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడులకు పాల్పడుతోంది. శనివారం రాత్రి ఒంటరి ఏనుగు గుట్టపాళ్యానికి చెందిన శంరయ్య, సురేష్, కార్తీక్, విజయ్‌కుమార్‌కు చెందిన నాలుగు ఎకరాల వరి పంటను తొక్కి నాశనం చేసింది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ఏనుగు పంట పొలాలను నాశనం చేసి తిరిగి అడవిలో తిష్ఠ వేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడు దాడి చేస్తుందోనని గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు. ఏనుగులు గ్రామాల వైపు రాకుండా అటవీ ప్రాంతం వద్ద సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా బీటు అధికారి లావణ్య మాట్లాడుతూ ఏనుగును ట్రాకర్ల సహాయంతో సదుం మండలం చీకలచేను అటవీ ప్రాంతానికి తరిమివేసినట్లు తెలిపారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), మార్చి 10: కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్ చంపాపేటకు చెందిన విద్య రూ.1,00,116 ఆదివారం విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పుంగనూరు శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పుంగనూరు, మార్చి10: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకట రమణస్వామి ఆలయంలో ఈనెల 17నుంచి 27వ తేదీ వరకు టీటీడీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో అర్చకులు శ్రీనివాసాచార్యులతో కలసి బ్రహ్మోత్సవ పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 17న సుప్రభాతం, అభిషేకం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ, హారతి, 18న ధ్వజారోహణం, 19న చిన్న శేషవాహనం, హంసవాహనం, 20న సింహవాహనం, సాయంత్రం ముత్యపు పందిరి వాహనం, 21న కల్పవృక్షవాహనం, హనుమంతవాహనం, 22న మోహినీ ఉత్సవం, గరుడవాహనం, 23న సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభవాహనం, 24న కల్యాణోత్సవం, సాయంత్రం గజవాహనం, 25న రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 26న వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణం, 27న తిరుప్పావడసేవ, శయనోత్సవాలు జరుగుతాయన్నారు.

సావిత్రీబాయిపూలే సేవలు అమోఘం



మాట్లాడుతున్న తులసీనాథంనాయుడు

గంగవరం,మార్చి10:తొలి మహిళా ఉపాధ్యాయురాలు సాయిత్రీబాయి పూలే సేవలు అమోఘమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు పేర్కొన్నారు. ఆదివారం సాయిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కళామందిరంలో ఆమె చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా రాణించి తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న సావిత్రీబాయిపూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, భూపాల్‌రెడ్డి, హర్షిత పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో పేదల బతుకుల బాగు



సూపర్‌సిక్స్ పథకాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మార్చి 10: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల బతుకులు బాగుపడతాయని టీడీపీ నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, నరసింహులు, విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. ఆదివారం వారు రామకుప్పంతోపాటు మిట్టపల్లె, బల్ల, ఉస్సిగానిపల్లె, విజలాపురం తదితర గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జనసేనలతో కలసి మరిన్ని పథకాలను కూడా త్వరలో ప్రకటిస్తారన్నారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు సీతాపతి, శ్రీనివాసులురెడ్డి, నందారెడ్డి, రామకృష్ణప్ప, వెంకటరమణ, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, నాగభూషణం, కుమార్, టీవీరవి, గంట్లరెడ్డి, బాలరాజు, సుబ్రీ, సతీష్, ఆదిల్, అవినాశ్, నరసింహులు, శంకర్, దయానంద్, బొరుగుల శీన, శ్రీనివాసులు, నవీన్, చలపతి, బీజేపీ నేత ఆంజినేయులు, జనసేన నేత సురేష్ పాల్గొన్నారు.

'40 రోజుల్లో ఎవర్ని ఎక్కడికి పంపుతారో తెలుస్తుంది'

పలమనేరు, మార్చి10 : రానున్న 40 రోజుల తరువాత ఎవరు ఎవర్ని ఎక్కడికి పంపుతారో తెలుస్తుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ 40రోజుల తరువాత పెద్దిరెడ్డి పవర్ ఏమిటో తెలుస్తుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డిని గురించి పేర్కొనడాన్ని టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. 40 రోజులు తరువాత అమరనాథరెడ్డిని ఇంటికి పంపుతారో, శాసనసభకు పంపుతారో... మిమ్మల్ని బెంగళూరుకు పంపుతారో తెలుస్తుందని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంకటేగౌడులాగా అమరనాథరెడ్డి కుటుంబం అవినీతికి పాల్పడలేదన్నారు. టీడీపీ నాయకులు కిషోర్‌గౌడ, గిరిబాబు, నాగరాజు, ఖాజాపీర్ పాల్గొన్నారు.

ఇరువురి మధ్య వివాదం

గొడవ ఎందుకని అడిగిన మరో వ్యక్తికి కత్తిపోట్లు

కల్లూరు, మార్చి10: ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం గురించి మరో వ్యక్తి ప్రశ్నించడంతో కత్తిపోట్లకు గురైన ఘటన పులిచెర్ల మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి కథనం మేరకు ...ఎల్లంకివారిపల్లికు చెందిన రషీద్, మహమ్మద్ షరీఫ్ మధ్య ఈనెల 8వ తేదీ రాత్రి వివాదం జరిగింది. శనివారం ఉదయం గోపన్నగారిపల్లి రహదారి వద్ద ఉన్న మహమ్మద్ షరీఫ్‌ను ఇదే గ్రామానికి చెందిన బారేషా (31) మాట్లాడుతూ రషీద్‌తో ఎందుకు గొడవ పడ్డావని అడిగాడు. ఆయన బారేషాతోనూ గొడవ పడ్డాడు. మహమ్మద్ షరీఫ్ తన వద్ద ఉన్న చాకుతో బారేషా కడుపుపై రెండు చోట్ల పొడిచి పారిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన బారేషా తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనకదాస, సంగొళ్ళిరాయల విగ్రహాల ఆవిష్కరణ



రామకుప్పం, మార్చి 10: పట్టణ శివార్లలో ఏర్పాటు చేసిన భక్త కనకదాస, సంగొళ్ళిరాయల విగ్రహాలను మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం మధ్యాహ్నం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమర్‌ను విమర్శించే అర్హత వైసీపీకి లేదు

రామకుప్పం, మార్చి 10: మాజీ మంత్రి అమరనాథరెడ్డిని విమర్శించే అర్హత మంత్రి పెద్దిరెడ్డితోపాటు వైసీపీ నేతలకు లేదని టీడీపీ నేతలు మునస్వామి, పత్రనారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి తెలిపారు. ఆదివారం రామకుప్పంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుట్రపూరిత రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. సమావేశంలో నేతలు రామ్మూర్తి, రామకృష్ణప్ప, జయశంకర్, మహ్మద్‌రఫీ. మనోహర్, సత్తి, కామరాజనాయక్, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

బైరెడ్డిపల్లె, మార్చి10 : బైరెడ్డిపల్లెలో ఆదివారం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో 1056 సంఘాలకు రూ. 38.51కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా నాలుగు విడతల్లో 14,048 మంది లబ్ధిదారులకు రూ.26.34కోట్లు అందజేశామన్నారు. అనంతరం బైరెడ్డిపల్లె-పుంగనూరు రహదారికి సంబంధించిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, ఎంపీపీ రెడ్డెప్ప, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, దయానందగౌడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రబలగాల కవాతు



పలమనేరు, మార్చి 10 : ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఆదివారం పలమనేరులో కేంద్ర బలగాలు పురవీధుల్లో కవాతు చేశాయి. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సహదేవి ఆధ్వర్యంలో 70 మంది కేంద్ర బలగాలు తుపాకులు చేతపట్టుకుని కవాతులో పాల్గొన్నారు.

నెల్లిమందలో ఇంటి పట్టాల పంపిణీ

సోమల, మార్చి 10: నెల్లిమంద సచివాలయంలో ఆదివారం ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలను జడ్పీటీసీ కుసుమ, ఏఎంసీ చైర్‌పర్సన్ అరుణ అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు, వీఆర్వో సుబ్రమణ్యం, కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగస్త్యేశ్వరుడి రథోత్సవం






ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి, ఆలయం వద్ద రథాన్ని లాగుతున్న భక్తులు

పుంగనూరు రూరల్, మార్చి10: పుంగనూరు మండలం నెక్కొంది ప్రసన్న పార్వతీదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరించి ప్రసన్న పార్వతీదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. భక్తులు రథంపై మిరియాలు, ఉప్పు, పూలు, నవధాన్యాలు చల్లి తమ మొక్కులు తీర్చుకుంటూ రథాన్ని లాగారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లను అలంకరించి అర్చకులు రాజన్న, సోమశేఖర్, చంద్రశేఖర్ దీక్షితులు కల్యాణోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నేత్రపర్వంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

రామకుప్పం, మార్చి 10: రాష్ట్ర సరిహద్దుల్లోని కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ తాలూకా ఆవని గ్రామంలో నెలకొన్న రామలింగేశ్వరుడి వార్షిక జాతరలో భాగంగా ఆదివారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ రథోత్సవాన్ని చూసేందుకు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా మన జిల్లా నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆవని జనసంద్రంగా మారింది. ఉదయం రథంలో సర్వాలంకార శోభితులైన సీతా, రామ, పార్వతి, రామలింగేశ్వరస్వామి ఉత్సవర్లను అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాలు, డప్పులహోరు, కోలాటలు, చెక్కభజనల మధ్య రథాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహరతులిచ్చారు. స్థానికులు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అడుగడుగునా పానకం, వడపప్పు, మజ్జిగలతోబాటూ అన్నదానాలు చేశారు.





రామలింగేశ్వరస్వామి రథోత్సవం, పాల్గొన్న భక్తజన సందోహం

యువత రాజకీయాల్లోకి రావాలి : అమర్





యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమరనాథరెడ్డి, జనసేనలో చేరిన యువతతో నరేశ్

పలమనేరు, మార్చి10 : నేడు రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం వుందని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి అభిప్రాయపడ్డారు. పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన సమక్షంలో వైసీపీకి చెందిన పలువురు యువకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అరాచక జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్వీబాలాజి, కిషోర్‌గౌడు, ఆర్సీకుట్టి, గిరిబాబు, వీరప్ప, అబ్దుల్లా, నాగరాజు, జయన్న రమేష్, మునస్వామి, విల్వనాథ్, ఉపేంద్ర, లోక్‌నాథరెడ్డి, సురేష్, చంద్ర, తిప్పారెడ్డి, చిట్టిబాబు, గోపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి యువత

కుప్పం : కుప్పంలో జనసేన పార్టీకి ఆదరణ పెరుగుతోంది. పార్టీ కార్యాలయంలో ఆదివారం పెద్దయెత్తున యువత ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నరేశ్ వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వీరమహిళ నవనీత, పవన్, మహేశ్, సుధాకర్, సురేశ్, దేవ, లోకేశ్, బాలు, శంకర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 20 కుటుంబాలు

కుప్పం పురపాలక సంఘం 1వ వార్డు పరిధిలోని సామగుట్టపల్లెకు చెందిన 20 కుటుంబాలు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ సర్పంచి జయకాంతమ్మ, హనుమప్ప దంపతులతోసహా పార్టీలో చేరిన ఈ కుటుంబాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ సాంబశివం, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, ఆర్ఆర్.రవి పాల్గొన్నారు.

చంద్రన్నతోనే బలిజల బాగు : కంచర్ల



బలిజల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మార్చి 10: బలిజల బాగు చంద్రన్నతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. ఆదివారం కుప్పం మండల బలిజలతో టీడీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న 2014-2019 మధ్యకాలంలో కాపులకు ఎన్నో ప్రయోజనాలు, పథకాలు అందజేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడికి ఓట్లేసి లక్ష మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు, పి.గోపీనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, ఆర్ఆర్.రవి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం : దండికుప్పం పంచాయతీ నల్లరాళ్లపల్లె, దండికుప్పం, చౌడంపల్లె, కదిరముత్తనపల్లె, సిద్దారెడ్లపల్లె, కొండకిందపల్లె, నిమ్మనపల్లె గ్రామాల్లో ఎమ్మెల్సీ శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు, విస్తరణ కమిటీ కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు ఉదయకుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, మునిరెడ్డి, నామాలప్ప, జయరాం, మణి, రమణబాబు, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు. మఠం పంచాయతీ పొన్నపల్లెలో వైసీపీ నేతలు వై.శ్రీనివాసులు, రాఘవ, జీవి వెంకటేష్, జీవి చంద్ర, వై.పురుసోత్తం, ఉదయకుమార్, శివకుమార్‌తోపాటు 50 మంది యువకులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జయపాల్, వి.వెంకటేష్, వి.శ్రీనివాసులు, యల్లప్ప, రామచంద్రప్ప, నారాయణప్ప, గంట్లప్ప పాల్గొన్నారు.

క్రీడా వస్తువుల వితరణ



పుంగనూరు రూరల్, మార్చి10: పుంగనూరుకు చెందిన విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ బాబు విద్యార్థులకు క్రీడా వస్తువులను వితరణ చేశారు. ఆదివారం పుంగనూరు మండలం ఏతూరు, పిచ్చిగుట్లపల్లె, బండ్లపల్లె, పాళ్యంపల్లె, ఆరడిగుంట, పుంగనూరులోని గురుకులాలకు చెస్, క్యారమ్, షటిల్, హ్యాండ్‌బాల్, క్రికెట్, టెన్నికాయిట్, బోర్డులను పంపిణీ చేశారు. గురుకులం ఆచార్యులు మణికంఠ పుంగనూరులో పిల్లలకు ప్రతి రోజు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.

వి.కోటలో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్



వి.కోట, మార్చి 10: వి.కోటలో ఆదివారం మార్కెట్ వద్ద నుంచి పురవీధుల మీదుగా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు పథ సంచలన్ చేపట్టారు. ఆపై పీఎంఆర్ కళ్యాణ మండపంలో స్వయం సేవకులను ఉద్దేశించి ఆర్ఎస్ఎస్ ప్రాంత బౌద్దిక్ ప్రముఖ్ పుట్టా శేషు ఉపన్యసించారు. సుదీర్ఘ కాలం న్యాయపోరాటం అనంతరం అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిందన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మన భావితరాలకు హిందుత్వం గురించి చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యవాహ ధనుంజయ, దుర్గామాత ఆలయ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, వీరాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త నాగరాజేంద్ర, గ్రామపెద్దలు సుబ్బన్న, శ్రీనివాసులు, కృష్ణమూర్తి అయ్యర్, స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

13న షాదీమహల్ ప్రారంభం

పుంగనూరు, మార్చి10: పుంగనూరులో ఈనెల 13న షాదీమహల్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు అంజుమాన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ సలీంబాషా, ఎస్.ఇబ్రహీం తెలిపారు. ఆదివారం స్థానిక మసీదులో రాష్ట్ర జానపదకళల అకాడమి చైర్మన్ నాగభూషణం, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రకాంత్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము, అంజుమాన్ కమిటీ, ముస్లిం మైనార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ సలీం మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి కేటాయించిన రూ. 25లక్షలతో నూతనంగా షాదీమహల్ నిర్మించినట్లు తెలిపారు. అనంతరం ముస్లింలతో కలిసి వారు ప్రార్థనలు చేశారు. సమావేశంలో జబీల్, జాఫర్‌ఖాన్,ఇస్మాయిల్ సాహేబ్, అరీఫుల్లా, ముతవల్లీలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలుగా మార్పుపై బీజేపీ ఫ్లెక్సీ

పుంగనూరు, మార్చి 10: కేంద్రప్రభుత్వ పథకాలను రాష్ట్ర పథకాలుగా పేర్లు మార్పు చేశారని, ఇవి ప్రజలు గమనించాలంటూ బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు పి.అయూబ్‌ఖాన్ పుంగనూరులో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ఇవి మీకు తెలుసా! మీకోసం గమనించండంటూ ఫ్లెక్సీ పెట్టారు. పీఎం కిసాన్‌నిధి రాష్ట్రంలో వైఎస్ఆర్ రైతు భరోసాగా, పీఎం స్వానిధి యోజనను వైఎస్సార్ జగనన్నతోడుగా, ఆయుష్మాన్ భారత్‌ను వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీగా ఇలా రాష్ట్ర ప్రభుత్వం పేర్లు మార్పు చేసిందని పేర్కొన్నారు.

స్మార్ట్‌సిటీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు, మార్చి 10: ప్రభా గ్రాండ్ ఇన్ హోటల్‌లో ఆదివారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశ జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ నగరపాలక పరిధిలోని 50 డివిజన్లలో 50 కమిటీలను ఏర్పాటు చేసి స్థానిక సమస్యలను గుర్తిస్తామన్నారు. గుర్తించిన సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అన్ని డివిజన్లలో కార్యాలయాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు, ఫోన్ నెంబర్లను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. చిత్తూరులో యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని కమిటీలో తీర్మానించారు. ఈ సమావేశంలో సభ్యులు తాండవమూర్తి, శివకుమార్, సత్య, మురళీ, వేలు, సురేంద్రరెడ్డి, మోతి, కేశవరెడ్డి, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

పలమనేరు, మార్చి10 : పలమనేరు డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 12న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు 9959225678 నంబరుకు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సమస్యలను, ఫిర్యాదులను, సలహాలను తెలియజేయాలని స్వామి కోరారు.

వడ్డెర కమ్యూనిటీ భవనానికి భూమి పూజ

శాంతిపురం, మార్చి 10: తుమ్మిశి పంచాయతీ తులసినాయనపల్లెవద్ద ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వడ్డెర కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. ప్రభుత్వం వడ్డెర కమ్యూనిటీ భవనం కోసం సుమారు రూ.50లక్షల నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, తుమ్మిశి సర్పంచ్ చంగమరాజు, గుడుపల్లె వైసీపీ మండల కన్వీనర్ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

13న సంత వేలం

శాంతిపురం, మార్చి 10 : కెనమాకులపల్లె పంచాయతీ బడుగుమాకులపల్లె వారపు సంతకు ఈ నెల 13న సచివాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఏవి జయరాం, కార్యదర్శి అశ్వర్థనారాయణ, ఎంపీడీవో రాధాకృష్ణ తెలిపారు. అంగళ్ళు, పశువులు, ప్రైవేటు వాహనాలు, కోళ్ళుగొర్రెల సంతలకు వేలం పాట జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు కార్యదర్శి వద్ద రూ.3లక్షలు డిపాజిట్ చేయాలన్నారు.

బోయకొండ గంగమ్మకు పూజలు



చౌడేపల్లె, మార్చి 10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఆదివారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

గంగమ్మ ఆలయ హుండీ చోరీ

చౌడేపల్లె, మార్చి10: మొరంకిందపల్లెలోని గంగమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు హుండీ చోరీ చేశారు. ఆదివారం గ్రామస్థుల కథనం మేరకు.. ఏడాది క్రితం గంగమ్మ ఆలయాన్ని గ్రామ సమీపం కందూరు రోడ్డులో నిర్మించారు. హుండీ ఏర్పాటు చేశారు. ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లగా ఆలయ తలుపు తాళం బద్దలు కొట్టి తెరిచి ఉండడం గమనించారు. హుండీ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

బొమ్మిదొడ్డిలో భగవద్గీత ప్రచారం

పలమనేరు, మార్చి10: త్రైత సిద్ధాంత-ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు ఆదివారం బొమ్మిదొడ్డి గ్రామంలో ఇంటింటికి వెళ్లి త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పుస్తకాలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, బంగారుపాళ్యం ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షులు భాస్కర్, బాలాజి, సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సోమల, మార్చి 10: బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. శనివారం రాత్రి కలికిరి నుంచి సోమల వైపు రేషన్ బియ్యంతో ఓవాహనం వస్తున్నట్లు సమాచారంతో నిఘా వేయగా కందూరు వైద్యశాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలోనే 1640 కిలోల రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. పలమనేరుకు చెందిన మహమ్మద్ నయాజ్ బాషా, మహ్మ మద్ జిలానీలను అరెస్టు చేసి మరో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సోమల, మార్చి 10: సోమల మండలం తుగడంవారిపల్లె పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 2013-2014 ఏడాది 8వ తరగతి విద్యార్థులు అప్పటి గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు జయరాం, ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి, హెచ్ఎం శ్రీనివాసులు, ఆనాటి ఉపాధ్యాయులు వెంకట్రమణ రెడ్డి, జీసీకే ప్రసాద్, ఎస్వీ రమణ, రమణయ్య, సుధారాణి, ప్రభాకర్, హరీశ్, జహంగీర్, విద్యా కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మాదిగల ఆత్మీయ సమావేశం

రామకుప్పం, మార్చి 10: గడ్డూరు గ్రామంలో మంగళవారం మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు గోవిందప్ప, ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు ఉదయ్ తెలిపారు. మండల పరిధిలోని మాదిగలంతా సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

టీడీపీ బ్యానర్ల చించివేత



బైరెడ్డిపల్లె, మార్చి 10 : బైరెడ్డిపల్లె మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన టీడీపీ బ్యానర్లు, తోరణాలను శనివారంరాత్రి కొందరు వైసీపీశ్రేణులు చించేశారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

యువతి అదృశ్యం

పుంగనూరు రూరల్, మార్చి10: ఓ యువతి అదృశ్యమైనట్లు తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినటు హెడ్‌కానిస్టేబుల్ మహేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు .... భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నెకు చెందిన హరి కుమార్తె వరలక్ష్మి(21) ఈనెల 8వ తేదీ నుంచి కనబడలేదు. బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాహనంతో ఢీకొట్టి.. ఆపై పిడిగుద్దులు

గంగవరం, మార్చి 10: మండలంలోని గండ్రాజుపల్లెకు చెందిన మంజునాథ్ ఆదివారం రాత్రి సర్వీసు రోడ్డుపై నడుచుకుని వెళ్తుండగా, మర్రిమాకులపల్లెకు చెందిన కిషోర్ ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొన్నాడు. ఎందుకు ఢీకొన్నావు, కళ్లు కనిపించలేదా అని మంజునాథ్ ప్రశ్నించగా, నన్నే ప్రశ్నిస్తావా అంటూ మంజునాథ్‌పై పిడిగుద్దులు గుద్ది తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన మంజునాథ్‌ను పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం సీఐ చిన్నగోవిందు తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



జయహో బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు వరాల హామీలు ప్రకటించడాన్ని హర్షిస్తూ గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీ అప్పిరెడ్డికండ్రిగలో ఆదివారం బీసీ కుటుంబాలకు చెందిన ప్రజల మధ్య చంద్రబాబు, థామస్ ఫొటోల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్

'గురజాల'ను గెలిపించుకుంటాం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురజాల జగన్మోహన్ తదితరులు

గుడిపాల, మార్చి 10: రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడును గెలిపించుకుంటామని బెంగళూరులో వ్యాపారవేత్తలైన మండల వాసులు పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో జీజేఎంను గజమాలతో సత్కరించి, భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి ముత్తుప్రసాద్, పవన్‌కుమార్, చిట్టిబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాహుబలి సెటప్... ఓటుకు తొలి మెట్టు



చిత్తూరు, మార్చి 10: యువతకు ఓటు హక్కుపై అవగాహన పెంచడం, 18 సంవత్సరాలు నిండిన వారు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవడం, స్వేచ్ఛగా వినియోగించుకోవాలనే అంశంపై నగరపాలక అధికారులు ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా యువ ఓటర్లు ఎక్కువగా ఉండే ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో బాహుబలి సెల్ఫీ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఓటరు గుర్తింపుకార్డును భుజాలపై ఎత్తుకున్న బాహుబలి సెల్ఫీ కటౌట్లు యువతను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. యువత ఉత్సాహంగా సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ తాము ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామని చెబుతున్నారు.

శాంతి భద్రతల పర్యవేక్షణకే పోలీసుల కవాతు: డీఎస్పీ



కవాతు చేస్తున్న పోలీసులు

నగరి, మార్చి 10: ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల కానున్నందున శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పోలీసులు కవాతు నిర్వహిస్తున్నట్లు నగరి డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. నగరిలో ఆదివారం నేపాల్ సరిహద్దులో వున్న స్పెషల్ బెటాలియన్ సిబ్బంది 89 మందితో డీఎస్పీ నరసింహమూర్తి, రూరల్ సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణలు కవాతు నిర్వహించారు. పోలీసుల అనుమతులు లేనిదే ర్యాలీ, బహిరంగసభ, మైక్ పెట్టుకోవడం, రాస్తారోకోలు చేయరాదని డీఎస్పీ తెలిపారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని, పోలీసుల సలహాలు, సూచనలు పాటించి ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

జగన్ కాళ్లు పట్టుకునే పనికిమాలినోడు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై థామస్ విమర్శ

వెదురుకుప్పం, మార్చి 10: కూతురికి పదవి కోసం సీఎం జగన్ కాళ్లపై సాష్టాంగంగా పడే డిప్యూటీ సీఎం నారాయణస్వామి పనికిమాలినోడని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ విమర్శించారు. వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెదురుకుప్పం, పెనుమూరు మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎంకు ప్రాధాన్యత ఇవ్వలేదని, పెనుమూరులో జరిగిన సమావేశంలో ఎక్కడో ఒక మూలన కూర్చోబెట్టారని, డిప్యూటీ సీఎం పనికిమాలినోడనో, లేదా అంటరానివాడనో అలా పెట్టారని... ఈ రెండింటిలో ఏదో తనకు తెలియదని థామస్ ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎంగా అవమానం జరిగినా ఆయన ఫీల్ అయ్యారో లేదో తెలియదు కానీ తాము మాత్రం అవమానంగా ఫీల్ అయ్యామని చెప్పారు. ఈ నియోజకవర్గంతో సంబంధం లేని వ్యక్తికి ఇచ్చిన ప్రాధాన్యత కూడా నారాయణస్వామికి లేకపోయిందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి దళిత ద్రోహి అని యుగంధర్ ధ్వజమెత్తారు. వైసీపీలో ఆత్మాభిమానం ఉన్న వాళ్లంతా ఆపార్టీని వీడి, థామస్ విజయానికి కృషి చేయాలన్నారు.

భక్తి ప్రపత్తులతో సోది ఉత్సవం



సోది ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, మార్చి 10: స్థానిక గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గత మూడో రోజులుగా నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారికి సోది ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా రానున్న రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో జరుగనున్న మార్పుల గురించి తెలియజేశారు. అనంతరం ఆలయ అర్చకులు బి.కె. కుమార్ అమ్మవారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు పంపిణీ చేశారు. అదేవిధంగా నగరంలోని 2వ వార్డు దొడ్డిపల్లె నీవా నది సమీపంలోని శ్మశానంలో ఎల్.జి. తిరుకుమరన్ ఆధ్వర్యంలో, చవటపల్లె కైలాసపురం శ్మశానంలో స్థానిక బెస్త కులస్థులు మయానసేవను వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వసంతాలతో ముగిసిన శ్మశానకొల్ల

గుడిపాల, మార్చి 10: మండలంలోని బొమ్మసముద్రం గ్రామంలో ఆదివారం అంకాళ పరమేశ్వరి శ్మశానకొల్ల కార్యక్రమం వసంతాలతో ముగిసింది. గత నాలుగు రోజులుగా గ్రామంలో శ్మశానకొల్ల 100వ సంవత్సర కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులైన ఆవిశెట్టి, గ్రామపెద్దలు, దాతల సహకారంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మంగళవాయిద్యాల మధ్య బాణసంచా వేడుకలతో పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామస్తులతో పాటు పక్కరాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు పాల్గొనడం విశేషం.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, మార్చి 10: మండల కేంద్రమైన పూతలపట్టు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో ఆదివారం పంటపల్లి గ్రామస్తులు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ చంద్రమౌళి, పంటపల్లి గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన బహిరంగ సభను విజయవంతం చేయండి: గురజాల

చిత్తూరు సిటీ, మార్చి 10: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాల మైదానంలో సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. ఈ సభకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్య నేతలు హాజరవుతారని, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాగా సభ ఏర్పాట్లకు సంబంధించి ఆదివారం ఆ పార్టీ నేతలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడు, వరలక్ష్మి, జయరాజ్, చిట్టిబాబు నాయుడు, నందగోపాల్, నరేష్, సాయిరాం, బాలాజి నాయుడు, ఆనంద నాయుడు, జానకిపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగులగొట్టి చోరీకి ప్రయత్నం



చిత్తూరు, మార్చి 10: కారు అద్దాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించిన సంఘటన నగరంలోని సీఎంటీ రోడ్డులు చోటుచేసుకుంది. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు... సీఎంటీ రోడ్డులో ఉన్న దామోదర్ నాయుడు హైదరాబాదులో వ్యాపారం చేస్తున్నాడు. ఈయన తన నివాసం ముందు కారును ఆపి వెళ్లాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కారు వెనుక భాగంలో ఉన్న అద్దాన్ని పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నించారు. అద్దాన్ని పగులగొట్టే సమయంలో శబ్దం రావడంతో పక్కనే ఉన్న లారీ డ్రైవర్లు అరవడంతో దొంగలు పారిపోయారు. ఈ మేరకు బాధితుడి బంధువులు ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగరి అభివృద్ధే లక్ష్యం
- కొండూరు అశోక్‌రాజు



విజయపురం, మార్చి 10: నగరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని సిద్ధార్థ గ్రూప్ సంస్థల అధినేత, ఇటీవల బీజేపీలో చేరిన కొండూరి అశోక్‌రాజు తెలిపారు. ఆదివారం విజయపురంలో మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉండగా చేసిన సేవలను వివరించారు. 1983లో టీడీపీలో చేరి 40 సంవత్సరాల పాటు పార్టీకి సేవలు చేశానని తెలిపారు. 2002 నుంచి ఎమ్మెల్యే రేసులో ఉన్నా చివరి క్షణంలో అభ్యర్థులను మార్చి తనను మోసం చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ నుంచి దూరమయ్యానని ఆయన చెప్పారు.

రోడ్డు పనులకు భూమి పూజ


వెదురుకుప్పం, మార్చి 10: స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి వెదురుకుప్పం వరకు నూతనంగా మంజూరైన బీటీ రోడ్డు పనులకు ఎంపీటీసీ ఎస్.రాధిక ఆధ్వర్యంలో ఆదివారం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి భూమి పూజ చేశారు. చవటగుంట పీఏసీఎస్ కార్యాలయం వద్ద డీసీసీబీ ఏటీఎంను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజ, కామధేను వాహనాలపై విహరించిన మొగిలీశ్వరుడు



బంగారుపాళ్యం, మార్చి 10: స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి ఆదివారం ఉదయం గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయదార్లుగా మొగిలివారిపల్లెకు చెందిన వసంతమ్మ, లేట్ పి. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రాత్రి ఉత్సవమూర్తులను కామధేను వాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమానికి మొగిలి పరిసర గ్రామాలకు చెందిన నాయీ బ్రాహ్మణసంఘం సభ్యులు ఉభయదార్లుగా వ్యవహరించారు. రాత్రి నాదస్వర, సంగీత కచేరి నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయ్‌కుమార్, ఈవో మునిరాజ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

స్మార్ట్‌సిటీ సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

చిత్తూరు, మార్చి 10: నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశ జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ నగరపాలక పరిధిలోని 50 డివిజన్లలో 50 కమిటీలను ఏర్పాటు చేసి, ఒక్కో కమిటీలో ఐదుగురు యువతీ యువకులతో స్థానిక సమస్యలను గుర్తిస్తామన్నారు. ఆ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అన్ని డివిజన్లలోని కార్యాలయాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు, ఫోన్ నెంబర్లను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. చిత్తూరులో యూనివర్సిటీని ఏర్పాటుచేయాలని కమిటీలో తీర్మానించారు. ఈ సమావేశంలో సభ్యులు తాండవమూర్తి, శివకుమార్, సత్య, మురళీ, వేలు, సురేంద్రరెడ్డి, మోతి, కేశవరెడ్డి, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూతలపట్టులో అన్నదానం చేస్తున్న పంటపల్లి గ్రామస్తులు

అసంపూర్తిగా పాఠశాల ప్రహరీ నిర్మాణం



పాలసముద్రం ప్రాథమిక పాఠశాలలో పునాదులకే పరిమితమైన ప్రహరీ నిర్మాణం

పాలసముద్రం, మార్చి 10: మండలంలోని పాలసముద్రం ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సుమారు నాలుగు సంవత్సరాల క్రితం రూ.13.50 లక్షలను ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పునాదులు, పిల్లర్లు వేసి రెండు వైపులా మాత్రం గోడలు కట్టి, వాటిని అసంపూర్తిగా వదిలేశారు. పాఠశాల గ్రామానికి చివర్లో ఉండటంతో కొంతమంది రాత్రి వేళల్లో ఇక్కడ మద్యం సేవిస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రహరీ నిర్మాణపనులు పూర్తిచేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వారు పేర్కొంటున్నారు. పాలసముద్రం-సింహరాజుపురం తారురోడ్డును ఆనుకుని పాఠశాల ఉండటంతో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు ఎక్కువగా వెళుతుంటాయి. దీనితో విద్యార్థులు పాఠశాలకు వచ్చేటప్పుడు, విరామ సమయంలో వారిని పర్యవేక్షించడం తమకు కష్టంగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణం గురించి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణ పనులు పూర్తిచేయించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి భారీగా చేరికలు



జనసేన పార్టీలో చేరుతున్న రెడ్డిగుంట కిషోర్ తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 10: వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. ఆదివారం నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలోని జనసేన పార్టీ కార్యాలయంలో వైసీపీ నేత రెడ్డిగుంట కిషోర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. గిరింపేట, ప్రశాంత్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది వైసీపీ కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వచ్చి జనసేన పార్టీలో చేరారు. వారికి ఆరణి శ్రీనివాసులు కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డిగుంట కిషోర్ యువ నాయకుడని, వైసీపీకి రాజీనామాచేసి జనసేన పార్టీలో చేరడం శుభపరిణామమని అన్నారు. ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరా...?
- కూల్చివేసి రెండేళ్లు అయినా పట్టించుకోని అధికారులు



గతంలో కుంగిపోయిన ఆర్‌కేవీబీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ, రెండేళ్లు అయినా ప్రహరీ నిర్మించని దృశ్యం

కార్వేటినగరం, మార్చి 10: ఆర్‌కేవీబీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ రెండేళ్ల క్రితం ఒక పక్కకు కుంగిపోయింది. దీంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని అధికారులు దానిని కూలగొట్టించారు. రెండేళ్లు అవుతున్నా ఇంతవరకు దాని నిర్మాణం గురించి పట్టించుకోలేదు. నాడు-నేడు పనులతో పాఠశాలలకు మహర్దశ వచ్చిందని గొప్పలు చెప్పే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రహరీ నిర్మాణం గురించి ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మరో ఒకటిన్నర నెలలో పాఠశాల విద్యా సంవత్సరం కూడా ముగిసిపోనుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీకి ఓటమి ఖాయం
- భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు



విజయపురంలో భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

విజయపురం, మార్చి 10: వైసీపీకి ఓటమి ఖాయమని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విజయపురం, మిట్టూరు, దక్షిణపు ఆదిఆంధ్రవాడ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేసి, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయపురం టీడీపీలో గతంలో సమన్వయ లోపం ఉండేదని, ప్రస్తుతం పసుపుదళం ఏకమై ఐక్యమత్యంగా పార్టీ కార్యక్రమాలు చేస్తుంటే ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాతార్కాడుకు చెందిన వైసీపీ కార్యకర్తలు నాగభూషణంయాదవ్, విజయకుమార్, వేద నారాయణ యాదవ్, సురేష్, వెంకటేసులు భాను సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయపురంలో కాంగ్రెస్, వైసీపీ నుంచి రఘు, రఘురామరాజు, డీలరు రామచంద్రరాజు, రమేష్‌యాదవ్, రిటైర్ టీచర్ రామచంద్రరాజు తదితరులు టీడీపీ సొంత గూటికి చేరారు. కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధికారప్రతినిధి చినబాబు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ రాజు, బాబుయాదవ్, జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి స్వామినాథన్, సమన్వయకర్త మెరుపుల మహేష్, నాయకులు మురళీరాజు, కపిల్, అశోక్, శామువేలు, బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువత

నింద్ర, మార్చి 10: మండలంలోని అత్తూరు పంచాయతీ సర్పంచ్ మలర్‌వేణి, సీనియర్ టీడీపీ నాయకులు, యువత బాలాజీ, సురేష్, గోపీ, ఇళయారాజాల ఆధ్వర్యంలో సుమారు 40 మంది వైసీపీకి చెందిన యువత ఆదివారం నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎంపీపీ భర్త రాజగోపాల్, మరికొంతమంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెంది, యువతకు ఉద్యోగావకాశాలు కలుగుతాయని అన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ లోకేష్, మాజీ ఎంపీటీసీ గిరి, నాయకులు విజయ్‌కుమార్, గాలి రమేష్ నాయుడు, లోకనాథం నాయుడు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబే కాబోయే సీఎం: థామస్



బైక్ ర్యాలీలో పాల్గొన్న థామస్ తదితరులు

వెదురుకుప్పం, మార్చి 10: టీడీపీ అధినేత చంద్రబాబే కాబోయే సీఎం అని ఆ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. ఆదివారం వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె పంచాయతీలోని రామకృష్ణాపురం, బొమ్మయ్యపల్లె, బొమ్మయ్యపల్లె కాలనీల్లో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. చంద్రబాబు చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. నారాయణస్వామి కుటుంబ రాజకీయం, వారసత్వ రాజకీయాలు చేశారే తప్ప ఎవరికీ న్యాయం చేయలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని థామస్ అభ్యర్థించారు. గానుగ పెనుం వద్ద బెల్లం పాకాన్ని ఆయన తిప్పారు. బొమ్మయ్యపల్లె పంచాయతీ దేవళంపేట రామాలయం నుంచి రామకృష్ణాపురం వరకు టీడీపీ ఎన్‌ఆర్ఐ జీడీనెల్లూరు నియోజకవర్గ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, యువ నాయకుడు భాష్యం సతీశ్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ థామస్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, నేతలు బట్టే చాణిక్యప్రతాప్, కోలా జయచంద్ర, గుండయ్య, సుధాకర్, పి.మోహన్‌మురళీ, చెంగల్రాయరెడ్డి, నాయకులు వి.నాగరాజురెడ్డి, భాస్కర్ నాయుడు శ్రీరాములు నాయుడు, రావిళ్ల వెంకటాద్రి నాయుడు, జనసేన నాయకులు యతీశ్వర్‌రెడ్డి, భానుప్రసాద్, పురుషోత్తం, రాఘవ, కావలి సతీశ్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమ సమాజం



పురస్కారాలు అందుకున్న సాహితీ వేత్తలు

చిత్తూరు కల్చరల్, మార్చి 10: మహిళా సాధికారతతోనే సమ సమాజ స్థాపన జరుగుతుందని, ఏ దేశమైనా మహిళాభ్యున్నతి లేనిదే అభివృద్ధి సాధించలేదని, ప్రభుత్వాలు తాము అమలు చేసే కార్యక్రమాల్లో వారికి తగినంత ప్రాముఖ్యత ఇస్తున్నాయని ప్రముఖ సాహితీవేత్త వి. హరి నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో బహుభాషా అనువాద రచయిత్రి ఎం.ఆర్. అరుణకుమారి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రచయిత్రి శ్యామలాదేవి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థకు పట్టుగొమ్మ గృహిణి అని చెప్పారు. మహిళలు నేడు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, విద్య, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. విజయం విద్యాసంస్థల అధినేత్రి శైలజామూర్తి మాట్లాడుతూ మహిళలకు నేటి ప్రభుత్వాలు ఆర్థిక పరమైన అంశాల్లో తగినంత ప్రాధాన్యమివ్వడంతో వారు పురుషుల కంటే మెరుగ్గా రాణించి గుర్తింపు పొందుతున్నారని తెలిపారు. రచయిత సి.ఎస్. చంద్రశేఖర్, సభా నిర్వాహకురాలు అరుణకుమారి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు అన్ని రంగాల్లో సమున్నత స్థానం కల్పించాలని కోరారు. అనంతరం సాహితీవేత్తలను మన సంస్కృతి సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వ్యవసాయ నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలి



చిత్తూరు రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 10: మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు రైల్వే స్టేషన్ ఎదుట మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గతంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ధర్నాకు స్పందించిన కేంద్రం నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఆ హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 14వ తేదీన ఢిల్లీలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే రైల్వేను కూడా మోదీ ప్రైవేటీకరణ చేసేదిశగా పావులు కదుపుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా మోదీ తన పంతాన్ని వీడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు గోపీనాథ్, చంద్ర, బాలాజీ, సీపీఎం నాయకులు జ్యోతి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరుడికి ఆదివారం పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ చైర్మన్, ఈవో

నగరవనం ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 10: ఆదివారం స్థానిక తిరుపతి రోడ్డులోని పెనుమూరు క్రాస్ వద్ద అటవీశాఖ ఏర్పాటు చేసిన నగరవనాన్ని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామితో కలిసి మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ చైర్మన్ జి. శ్రీనివాసులు, డీఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల అభిషేకం

గంగాధరనెల్లూరు, మార్చి 10: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలవర్లకు అభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, శ్రీదేవి సమేత నారాయణుల విగ్రహాలకు అర్చకులు వేదమంత్రాలతో పాలు, పెరుగు, పంచామృతం, పసుపు, కుంకుమ, గంధం, కొబ్బరినీళ్లతో అభిషేకం పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. ఈ పూజలకు చెన్నైకి చెందిన హారతి, జనార్ధన్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కోనేటివద్ద గల ధన్వంతరి, వినాయకస్వామిలకు అభిషేకం పూజలు ఆలయం తరపున నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ తరపున భాగవతారిణి జ్యోత్స్న హరికథ కాలక్షేపం చేయగా, అన్నమయ్య కీర్తనలు, వెంకటేశ్వర భక్తి గీతాలను జనార్ధన్ ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, భక్తులు పాల్గొన్నారు.



ఉభయదారు దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న మేనేజర్